సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 8 । మే । 2023



మరో చాన్స్..!

విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు రెండో దశలో సీట్ల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

- 8లో



అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది తెల్లవారిని గడగడలాడించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు.

- 8లో



వీరఘట్టంలో భారీ వర్షం

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రైతులు పొలాల నుంచి ఇళ్లకు చేరుకున్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేను కలిసిన డీఈఓ



ఎమ్మెల్యే జోగారావును కలిసిన డీఈఓ (ఎఫ్‌ఏసీ) ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్ కుమార్ పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావును క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు అభినందనలు తెలియజేస్తూ జిల్లా స్థాయిలో విద్యా విధానం మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురిటి మోహనరావు తదితరులు ఉన్నారు.

లక్ష్మీపేటలో పులి కలకలం



లక్ష్మీపేట పరిసరాల్లో పులివిగా భావిస్తున్న పాదముద్ర

కొమరాడ: మండలంలోని కంబవలస పంచాయతీ జంఝావతి రిజర్వాయర్ సమీపంలోని లక్ష్మీపేటలో పులి సంచరిస్తుందన్న సమాచారంతో గ్రామస్తులు భయందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పులిజాడను తెలుసుకుని, రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్‌-2023 ప్రవేశ పరీక్ష

- ఆరు పరీక్ష కేంద్రాల్లో 98 శాతం హాజరు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఐదు కేంద్రాలు, గరివిడిలోని ఒక కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'నీట్‌-2023 యూజీ' ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి 1,477 మంది దరఖాస్తు చేసుకోగా 1,454 మంది (98 శాతం) హాజరయ్యారు.

క్రీడా రంగానికి పెద్దపీట

- సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు



రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించిన వినీతను అభినందిస్తున్న సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు

రామభద్రపురం: విద్యారంగంతో పాటు క్రీడా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సెట్విజ్ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. వేసవి క్రీడా శిక్షణ తరగతుల్లో భాగంగా మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో ఒక్కో క్రీడకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూడో, తైక్వాండో, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు క్రీడా శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సీఎంకప్ పోటీల్లో పలు క్రీడా విభాగాల్లో జిల్లాకు బహుమతులు తీసుకొచ్చి జిల్లా ఖ్యాతి నిలబెట్టారని తెలిపారు. కొట్టక్కి ఉన్నత పాఠశాలలో జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిషోర్ ఆధ్వర్యంలో జూడో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆరికతోట ఉన్నత పాఠశాల పీడీ వి.అప్పలనాయుడు సొంత డబ్బులతో శిక్షణ తరగతులలో పాల్గొంటున్న సుమారు 50 మంది పిల్లలకు భోజనాలు పెట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలని సూచించారు. వేసవి క్రీడాశిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించిన వినీతను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రావాడ భాస్కరరావు పాల్గొన్నారు.

సగర్వంగా సర్కారుబడి

- పదోతరగతి ఫలితాల్లో ప్రతిభచూపిన ప్రభుత్వ బడుల విద్యార్థులు
- ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత
- జిల్లాలో శతశాతం సాధించిన 57 పాఠశాలలో 42 ప్రభుత్వ పాఠశాలలే..
- వేలాదిమంది విద్యార్థులు 500 పైబడి మార్కుల సాధన
- సత్ఫలితాలిచ్చిన ప్రభుత్వ విద్యా సంస్కరణలు
- ఫలించిన ఉపాధ్యాయుల సమష్టికృషి

పదోతరగతి ఫలితాల్లో సర్కారుబడి విద్యార్థులు ప్రతిభచూపారు. అత్యుత్తమ ఫలితాలు నమోదుచేశారు. వేలాదిమంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. ప్రభుత్వం అమలుచేసిన విద్యాసంస్కరణలు.. ఉపాధ్యాయుల సమష్టికృషి ఫలించింది. ఉత్తమ ఫలితాలతో ఊరిబడి మురిసింది. సగర్వంగా తలెత్తుకుంది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉత్తీర్ణతా శాతంలో అగ్రభాగంలో నిలిచింది. దీనికి శనివారం విడుదలైన పదోతరగతి ఫలితాల్లో సర్కారు బడుల విద్యార్థులు సాధించిన మార్కులు, ఉత్తీర్ణతే నిలువెత్తు నిదర్శనం.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది జియ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల. పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 27 మంది విద్యార్థులు ప్రథమ, 11 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణి, ఒక విద్యార్థి తృతీయ శ్రేణి సాధించి శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విజయంలో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల కృషి కొట్టిచ్చినట్టు కనబడుతుంది.



చిత్రంలో కనిపిస్తున్నది పాలకొండ మండలం బడ్డుమానసంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షరాయగా, శనివారం విడుదలైన ఫలితాల్లో 18 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి, ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. శతశాతం ఉత్తీర్ణత జాబితాలో ఈ పాఠశాల పేరు చేరింది.



ఈ చిత్రం... సీతంపేట మండలం సామరెల్లి ఆశ్రమ పాఠశాలది. ఈ పాఠశాలలో చదివిన 26 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా, శనివారం విడుదలైన ఫలితాల్లో అందరూ 500 పైబడి మార్కులు సాధించారు. ఆరిక నందిని 567, బిడ్డిక మౌనిక 565, టి.శ్రీవల్లి 564 మార్కులతో ముందువరుసలో నిలిచారు.

జిల్లాలో ఫలితాల నమోదు ఇలా..

ఉత్తీర్ణత శాతం	87.47
పరీక్షలకు హాజరైనవారు	10,689
ఉత్తీర్ణులైనవారు	9,350
ప్రథమ శ్రేణి సాధించిన వారు	7,865
ద్వితీయ శ్రేణి సాధించిన వారు	1151
తృతీయ శ్రేణి సాధించిన వారు	334

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ పాఠశాల అనగానే అందరికీ చిన్న చూపే.. చాలీచాలని తరగతి గదులు.. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు.. అరకొర వసతులతో దర్శనమిచ్చేవి. బోధనా సిబ్బంది కొరతతో ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ బడులకు ప్రాధాన్యం పెరిగింది. పేదకుటుంబాల పిల్లలు చదువుకునే పాఠశాలలను నాడు-నేడు పనులతో సుందరంగా తీర్చిదిద్దారు. సకలసదుపాయాలు సమకూర్చారు. చదువుకునే వాతావరణాన్ని సృష్టించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. బోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు.

ఉపాధ్యాయులు చక్కని బోధన ప్రణాళికను అమలుచేయడంతో పదోతరగతి ఫలితాల్లో సర్కారీ పాఠశాలల విద్యార్థులు సత్తాచూపారు. సగర్వంగా తలెత్తుకునే మార్కులు సాధించి అభినందనలు అందుతకుంటున్నారు. 87.47 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారు. జిల్లాలో శతశాతం సాధించిన 57 పాఠశాలలో 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తీరుకు నిలువెత్తు నిదర్శనం.

శతశాతం ఉత్తీర్ణత



బిడ్డిక అఖిల(559)

గుమ్మలక్ష్మీపురం: పదోతరగతి ఫలితాల్లో గుమ్మలక్ష్మీపురం మండలంలోని 8 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత నమోదుచేశాయి. కె.డి. కాలనీ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి 44 మంది పరీక్ష రాయగా 44 మంది, భద్రగిరిలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల నుంచి 59 మందికి 59 మంది, పి.ఆమిటిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి 78 మందికి 78 మంది, దుడ్డుఖల్లులోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి 19 మందికి 19 మంది, టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి 52 మందికి 52 మంది, భద్రగిరిలోని ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్‌కు చెందిన 79 మందికి 79 మంది, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్‌స్కూల్ నుంచి 80కి 80 మంది, గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ నుంచి 34 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. భద్రగిరిలోని ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ (పీటీజీ)కు చెందిన బిడ్డిక అఖిల టెన్త్ ఫలితాల్లో 559 మార్కులు సాధించింది. ఆమెను ప్రిన్సిపాల్ కమలకుమారి, ఉపాధ్యాయులు, ఎంఈఓ జె.నారాయణస్వామి అభినందించారు.



శతశాతం ఉత్తీర్ణత సాధించిన గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ

ఉపాధ్యాయుల చక్కని బోధనతో..



నా పేరు హేమలతా పాడి. నేను పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలో చదివి గత మార్చినెలలో జరిగిన పదోతరగతి పరీక్షలకు హాజరయ్యాను. 587 మార్కుల సాధించాను. మా అమ్మ సుష్మ, మా నాన్న హరిచంద్ర పాడి పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధ్యాయులు చక్కగా బోధించడం, ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తిచేయడంతోనే మంచి మార్కులు సాధించగలిగాను.



నా పేరు దూది లలిత. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలో చదివి 586 మార్కుల సాధించాను. నా తల్లిదండ్రులు అప్పారావు, ఉమ రోజువారి వేతనదారులు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఎంతగానో సహకరించారు. వారి సహకారంతో మంచి మార్కులు సాధించాను. మాలాంటి పేద కుటుంబాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు చదువుకు ఉపకరిస్తోంది.



నా పేరు కర్రి తనుశ్రీ. నేను కురుపాం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి 585 మార్కులు సాధించాను. మా నాన్న కర్రి తిరుపతి రావు కరోనాతో మృతి చెందారు. మా అమ్మ అనూరాధ ప్రోత్సాహంతో చదువుతున్నాను. పాఠశాల ఉపాధ్యాయులు అర్థమయ్యేలా విద్యాబోధన అందించారు. ప్రభుత్వం అందించిన పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఆ'శ్రమ' ఫలించింది..



పాలక గురునాథ్ (571)



ఆరిక నందిని (567)



ఆరిక సూర్యం (566)



ఎస్.హాసిని(548)

- ఆరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత
- మూడు ఆశ్రమపాఠశాలల్లో అందరూ ప్రథమశ్రేణిలో పాస్

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో ఆరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో దోనుబాయి, సామరెల్లి, పెద్దపొల్ల పాఠశాలల విద్యార్థులందరూ ప్రథమ శ్రేణిలో పాసయ్యారు.

- దోనుబాయి ఆశ్రమపాఠశాలలో పదోతరగతి పరీక్షలకు 35 మంది హాజరుకాగా 35 మంది ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. వీరిలో పాలక గురునాథ్ 571 మార్కులు సాధించాడు. ఈ పాఠశాలలో 500ల మార్కులు దాటిన వారు 33 మంది ఉన్నారు.
- పెద్ద పొల్లలో 16 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఆరిక సూర్యంకు 566 మార్కులు వచ్చాయి. మిగిలినవారందరూ 500ల పైబడి మార్కులు సాధించారు.
- హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 99 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ పాసయ్యారు. వీరిలో 97మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులుకాగా, మిగిలిన ఇద్దరు ద్వితీయశ్రేణిలో పాసయ్యారు.
- సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో 92 మందికి 89 మొదటి శ్రేణి, ముగ్గురు ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.
- సీతంపేట బాలుర ఆశ్రమపాఠశాలకు చెందిన 49కి 49 మంది ఉత్తీర్ణులు కాగా, 45 మంది ప్రథమ, ఇద్దరు ద్వితీయ, ఒకరు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరందరినీ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

రాణించిన కష్టజీవుల పిల్లలు



కేవటి రేవతి (568)



మంతిరెడ్డి శైలజ(565)



బిడ్డిక మణికంఠ (562)

భామిని: రోజువారీ కూలిపనులు చేసి జీవించే కుటుంబాల పిల్లలు కష్టపడి చదివారు. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. భామిని మండలం బాలేరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న కేవటి రేవతి 568 మార్కులతో మెరిసింది. తండ్రి కేవటి ప్రహ్లాదుడు మత్స్యకారుడు.

- పెద్దదిమిలి జెడ్పీహైస్కూల్ విద్యార్థిని మంతిరెడ్డి శైలజ 565 మార్కులు సాధించడంతో కూరగాయలు అమ్ముకుని జీవిస్తున్న తల్లిదండ్రులు మంతిరెడ్డి అచ్యుతరావు, నాగమణిలు సంబరపడుతున్నారు.
- లోహరిజోల గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు బిడ్డిక నాగేశ్వరరావు, సుకాంతి కుమారుడు మణికంఠ ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతూ పదోతరగతిలో 562 మార్కులు సాధించాడు. తల్లిదండ్రుల్లో ఆనందం నింపాడు.

జిల్లా యంత్రాంగానికి సీఎం అభినందనలు



విలేకరులుతో మాట్లాడుతున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

సాలూరు/మక్కువ: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించడంతో ఆదివారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా మంత్రి పీడిక రాజన్నదొరకు, కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు ఫోన్‌లో అభినందనలు తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, దానికి కారణమైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర తన నివాసంలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యంజిల్లా పదో తరగతి ఫలితాల్లో మొట్టమొదటి స్థానం సాధించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాకు మంచిపేరు తెచ్చిపెట్టిన కలెక్టర్, అధికార యంత్రాంగం, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉజ్వలభవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. పదోతరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో అభినందించడం గర్వంగా ఉందన్నారు.

శాస్త్రోక్తంగా సీతారామాలయం ప్రారంభోత్సవం



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావ

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయం ప్రారంభోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా జరిపారు. విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ, ధేనుదర్శనం, దర్పణదర్శనం తదితర పూజలను రుత్వికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతర సీతారామ కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీసభ్యులు అన్నసమారాధన జరిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలను సర్పంచ్ విరోతి కొండలరావు, మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, రవికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- అకాల వర్షాలపై యంత్రాంగం అప్రమత్తం
- ఉత్తరాంధ్ర జిల్లాలో తక్కువ శాతం పంట నష్టం
- ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణపై ప్రత్యేక కమిషన్
- విద్యపైపెట్టే ప్రతిపైసా రాష్ట్ర భవిష్యత్‌కు పెట్టుబడి
- ఉపాధ్యాయుల ఇష్టం మేరకే బదిలీల ప్రక్రియ
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం:

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ఆదుకుంటుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టంచేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉత్తరాంధ్రలో వర్షపాతం తక్కువగా నమోదుకావడంతో పెద్దగా పంట నష్టం లేదని మంత్రి చెప్పారు. అక్కడక్కడా మొక్కజొన్న, పార్వతీపురం మన్యం జిల్లాలో కొద్ది ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నట్టు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిజిల్లాకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించిందనీ, వారు జిల్లాల వారీగా సమీక్ష చేసి, పంట నష్టాలను నమోదుచేస్తారని చెప్పారు. వర్షాలకు తడిచిన ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

సంతృప్తికరంగా పది ఫలితాలు

ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాలపై మంత్రి బొత్స సత్యనారాయణ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, మిగిలిన 25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫలితాలకు సంబంధించి 45 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారని, వచ్చే ఏడాది పది, ఇంటర్మీయట్ ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు యంత్రాంగం ఇప్పటికే పని చేస్తోందని, ఫీజులు అధికంగా ఉంటే కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు కంటే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఎక్కువమంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చానన్నారు. విద్యపై పెట్టే ఖర్చు అంతా రాష్ట్ర భవితకు పెట్టుబడిగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని చెప్పారు.

దేశంలోనే ప్రథమస్థానంలో..

దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మెరుగైన విద్యా వ్యవస్థ అమలులో ప్రథమ స్థానంలో ఉందన్నారు. గతంలో ఢిల్లీ, కేరళ రాష్ట్రాలు ఆ స్థాయిలో ఉండేవని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుకు వెళ్తోందన్నారు. ప్రతీఒక్క విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలనే సంకల్పంతో ప్రభుత్వ విద్యను మెరుగుపరుస్తున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి నచ్చిన చోట చేర్పించుకునే హక్కు ఉందన్నారు.

ఉపాధ్యాయుల ఇష్టపూర్వకంగానే...

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ వారి ఇష్టం మేరకే చేపడతామని ఇప్పటికే వెల్లడించినట్టు మంత్రి చెప్పారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల కలిసి ఏక నిర్ణయాన్ని తెలియజేయాలని సూచించామన్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలుగా భావిస్తున్న పనులను తప్పించామన్నారు. ప్రభుత్వ ఆలోచన ప్రకారం ప్రతితరగతికి అవసరమైన ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. సమావేశంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్గిపిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం


అగ్గిపిడుగుపడి కాలిపోతున్న కొబ్బరి చెట్టు

సీతానగరం: ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఆదివారం సాయంత్రం సీతానగరం మండలంలోని పెదభోగిలిలో కొబ్బరి చెట్టుపై అగ్గిపిడుగు పడి మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. అదే ఇంటికి అమర్చిన విద్యుత్ మీటర్ కూడా కాలిపోయింది.

పదిమందిపై కేసు నమోదు

సీతంపేట: మండలంలోని మర్రిపాడు గ్రామంలో శనివారం రాత్రి అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తూ, పెద్దపెద్ద సౌండ్లు పెట్టి పాటలకు డ్యాన్సు చేయడంతో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. ఒడిశా నుంచి కొంతమంది మహిళలు, మగవారిని తెప్పించి ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడడంతో కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

60కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయితో ఎస్.కోట పోలీసులు, రెవెన్యూ అధికారులు

శృంగవరపుకోట: పట్టణంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అరకు నుంచి వస్తున్న కారులో అక్రమంగా తరలిస్తున్న 60కిలోల గంజాయిని ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో గంజాయి తరలిస్తున్న మహరాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఫరూక్ ఇస్మాయిల్‌అక్తర్, దలే అరుణ్ రామరావులను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరూ మన్యం ప్రాంతానికి చెందిన శ్యామ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో తెలిసిందని, ప్రస్తుతం శ్యామ్ పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోల సమక్షంలో ఎస్సై తారకేశ్వరరావు కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

ఆటోబోల్తా: ఇద్దరికి గాయాలు


మాధురిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి అరసాడ సమీప కొండవలస జంక్షన్ వద్ద ఆటోబోల్తాపడి తండ్రీకూతుళ్లకు ఆదివారం గాయాలయ్యాయి. అరసాడ సమీపంలో మామిడితోటలు పరిశీలించేందుకు వారు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమార్తె కందిశ ప్రసాద్, మాధురిలు గాయపడ్డారు. 108వాహన సిబ్బంది రాజారావు, పవన్‌కుమార్‌లు ప్రథమ చికిత్స అందించిన అనంతరం రాజాం సీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	62,180-00
బంగారం(22సి. 10గ్రా.)	57,000-00
వెండి (కిలో)	82,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹ 274

రంగమార్తాండ..!

- పౌరాణిక పాత్రల్లో పరకాయప్రవేశం
- విశ్వామిత్ర, కాలకౌశిక, భీమ, ధుర్యోధనుడి పాత్రల్లో రాణింపు
- పద్మశ్రీ యడ్ల గోపాలరావు, అమరావు సత్యనారాయణ, డీవీ సుబ్బారావులతో కలిసి ప్రదర్శన
- రంగసింహ బిరుదుతో జాతీయ స్థాయి గుర్తింపు


సత్కారం పొందుతున్న రాము

రాజాం: ఆయనొక సాధారణ రైతు కుటుంబనుంచి వచ్చిన వ్యక్తి. కళలన్నా..కళాకారులన్నా చిన్ననాటి నుంచే ఆసక్తి. ఆ ఇష్టమే ఆయనను చిన్నవయస్సుల్లోనే పౌరాణిక నాటకాలవైపు నడిపించింది. అనతి కాలంలోనే మంచి కళాకారుడిగా రాణించి ప్రజల మన్ననలతో పాటు పెద్దలు ఆశీర్వాదాలతో ఎన్నో సత్కారాలు పొందారు. ఇప్పటికీ సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్ర పాత్ర అంటే ఆయన పేరే అందరికి గుర్తుకు వస్తుంది. నాటక రంగ సింహ బిరుదును దక్కించుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సత్యవరపు రాము స్వగ్రామం రాజాం మండలం ఆగూరు. తన 15 వ ఏటనే పౌరాణిక రంగస్థల ప్రవేశం చేసిన సత్యవరపు రాము రైతు కుటుంబీకుడు. ఇప్పటికీ వన్నెతగ్గని నిండైన రూపంతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇప్పటివరకు ఇచ్చారు.

ఇంతింతై...

చిన్నచిన్న బుర్రకథలతో నటనా జీవితాన్ని ప్రారంభించిన ఆయన అనతికాలంలోనే పౌరాణిక రంగస్థలంపై పట్టు సాధించారు. ఆయన గాత్రం బాగుంటుందని జాతీయ స్థాయి కళాకారుడు చప్పా అప్పారావునాయుడు ప్రశంసించి ప్రోత్సహించడంతో విశ్వామిత్ర పాత్రలో సత్యహరిశ్చంద్ర నాటకంలో తొలి ప్రదర్శన ఇచ్చిన ఆయన అనంతరం వీరబాహుడు, కాలకౌశికుడు, సాత్యకి సహదేవుడు, బలరాముడు, భీముడు, దుర్యోధనుడు, అర్జునుడు వంటి పాత్రలతో పాటు హరిశ్చంద్రుడి పాత్రలో కూడా రాణించి ఎన్నో సత్కారాలు పొందారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావు, అమరాపు సత్యనారాయణ, చీకటి రామారావు, కెల్ల బలరాంస్వామి, కురిటి సత్యనారాయణ, ఏవీ వేంకటేశ్వరరావు, ఎం.వై.నాయుడు, డీవీ సుబ్బారావు, మంగాదేవి, పీఎస్.మాధవ్, నెల్లూరు సుధాకర్, కిలారి లక్ష్మి, బొబ్బిలి సావిత్రమ్మ, విజయరాజు, జయ నిర్మల, ఆబోతుల విశ్వనాథం తదితరుల సరసన నటించి, పోటాపోటీగా ప్రదర్శనలు ఇచ్చారు. తన 43 ఏళ్ల జీవితంలో 28 ఏళ్లుగా కళారంగానికి సేవలు అందిస్తూ వస్తున్నారు. పారితోషకమే ప్రధాన అంశంగా కాకుండా కళామ్మతల్లిపై మక్కువతో ప్రతిచోటా ప్రదర్శనకు ముందుకురావడం విశేషం.


విశ్వామిత్ర పాత్రలో రాము


అర్జునిడిగా రాణింపు


హరిశ్చంద్రుని పాత్రలో

ఐదువేలకు పైగా సత్కారాలు

కడప, కంది, మల్లయ్యపల్లె, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, సామర్లకోట, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి ఇలా తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో ఆయన ప్రదర్శనలు ప్రేక్షకులకు కనువిందుచేశాయి. ఇత్తడి కిరీటాలు, బంగారు, వెండి బహుమతులతో పాటు పలువురు పెద్దల సత్కారాలు పొందిన ఆయనకు మందరాడ బాలభారతి కళా నాట్యమండలి రంగస్థల రంగసింహ బిరుదు అందజేసి ఘనంగా సత్కరించింది. బొబ్బిలి, పార్వతీపురం, విశాఖపట్నం, రాజాం, కవిటి, వంతరాం, కొత్తకంచరాం, ఆగూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో విశ్వామిత్ర పాత్రలకు ఎన్నో సత్కారాలు పొందిన ఆయన ఐదువేలకుపైగా సన్మానాలు దక్కించుకున్నారు. ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీల్లో అర్జునుడి పాత్రకు ప్రథమ బహుమతి లభించింది. తన ఇష్టమైన పాత్ర విశ్వామిత్ర అంటూ రాము సాక్షికి తెలిపారు.

వ్యక్తిగత జీవితం



పేరు : సత్యవరపు రాము
జన్మస్థలం : ఆగూరు, రాజాం మండలం, విజయనగరం జిల్లా
తల్లిదండ్రులు: అచ్చమ్మ, పాపిశెట్టి
భార్య : దుర్గమ్మ
సంతానం : ముగ్గురు ఆడపిల్లలు (ధనలక్ష్మి, పార్వతి, పద్మ)
రంగస్థల ప్రవేశం : 1995
పేరుతెచ్చిన పాత్ర : విశ్వామిత్ర

గిరిజన గ్రామాల్లో స్థిరపడిన వారికే ఉపయోగం

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు/మక్కువ: గిరిజన గ్రామాలకు నిర్మిస్తున్న రహదారులు, బ్రిడ్జిల వల్ల గిరిజనుల కంటే, ఎక్కడి నుంచో, ఇక్కడకి వచ్చి స్థిరపడినవారికే ఎక్కువగా ఉపయోగముందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలంలోని కొట్టుపరువు గ్రామంలో ఆదివారం ఆయన గడగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుండగా, పలువురు గ్రామస్తులు బబ్లీఅనేరైతు రహదారి నిర్మాణానికి సహకరించడంలేదని ఆరోపించారు. అందుకు గల కారణాలను గ్రామస్తులను అడిగి రాజన్నదొర తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో రహదారి నిర్మిస్తే, ఉద్దేశపూర్వంగానే బబ్లీఅనే రైతు అడ్డుకుంటున్నాడన్నారు. 2008లో మావుడి రహదారి నిర్మించగా, ప్రస్తుతం పాడైందని, దానికి కారణం ఇక్కడ స్థిరపడిన రైతులు ఆయిల్‌పామ్, కంద, మొక్కజొన్న, పండ్లు నిత్యం వాహనాలపై తరలించడం వల్లనే అన్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరైతు స్వతహాగా రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చడంలేదన్నారు. పంచాయతీలో రహదారి ఏర్పాటుకు నాలుగు అడుగులు ఇవ్వడానికి బబ్లీఅనేరైతు ముందుకు రావడంలేదని, దీంతో మిగిలిన రైతులంతా బాధపడాల్సి వస్తోందన్నారు. బబ్లీ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బబ్లీఅనే రైతును, మిగిలిన రైతులంతా ఒప్పించి, రహదారి ఏర్పాటుకు సహకరిస్తారో? గిరిజనప్రాంతంగా ప్రకటించమంటారో? మీరే తేల్చుకోవాలని స్పష్టం చేశారు. బబ్లీకారణంగా పంచాయతీని షెడ్యూల్డ్ ఏరియగా ప్రకటించాల్సి వస్తుందన్నారు. గిరిజనులకు న్యాయంచేస్తూ, మరో విధంగా ఆలోచన చేద్దామని భావిస్తున్నప్పటికీ రైతులు సహకరించడంలేదన్నారు. కొట్టుపరువు మినహా మిగిలినచోట్ల రహదారుల ఏర్పాటుకు స్థిరపడిన రైతులు ముందుకు వస్తున్నారని, ఈ విషయమై రైతులంతా ఆలోచనచేయాలని డిప్యూటీసీఎం రాజన్నదొర కోరారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి


బలిజిపేట: వెంకటినాయుడు మృతదేహం

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి గ్రామానికి చెందిన కురిటి వెంకటినాయుడు పిడుగుపాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తన పశువులను మేపేందుకు పొలాలవైపు వెంకటినాయుడు వెళ్లాడు. అదే సమయంలో వాతావరణంలో మార్పు వచ్చి ఒక్కసారిగా పిడుగులు పడడంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యులను సర్పంచ్ మోహనరావు కుటుంబీకులను ఓదార్చారు.

పైప్‌లైన్‌పై పడి వ్యక్తి..


దాదా సాహెబ్ మృతదేహం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా మెయిన్ రోడ్డుపక్కన ఉన్న వాటర్‌పైప్‌లైన్‌పై జారి పడి కొత్తూరుకు చెందిన మొగల్ దాదాసాహెబ్ (58) శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మృతుని భార్య నిన్నిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

డీఎస్పీకి సత్కారం


డీఎస్పీని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

బొబ్బిలి: పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ కేంద్రం ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో బదిలీ అయిన డీఎస్పీ బి. మోహనరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. విశాఖపట్నం బదిలీపై వెళ్తున్న మోహనరావు దంపతులను సత్కరించి వారి సేవలను కొనియాడారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: భరతమాతను దాస్య శృంఖలాల నుంచి విముక్తురాలిని చేసేందుకు.. మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది తెల్లవారిని గడగడలాడించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను అర్పించిన అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయమని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని అల్లూరి సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని దాసన్నపేట రైతు బజార్ కూడలి(అల్లూరి సీతారామరాజు జంక్షన్) వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా కోలగట్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్ర దానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 99 ఏళ్లు గడిచినా సీతారామరాజు ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నారన్నారు. ఇటువంటి మహనీయుల వర్ధంతి, జయంతి సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ఈ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ పోరాట యోధుని స్ఫూర్తిని చిరస్థాయిగా ఉంచేందుకే తమ హయాంలో దాసన్నపేట వద్ద విగ్రహం నెలకొల్పడంతో పాటు, అల్లూరి సీతారామరాజు కూడలిగా నామకరణం చేశామని గుర్తు చేశారు.

పోరాటయోధుల గడ్డ ఉత్తరాంధ్ర

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం ద్వారా వారి ఆశయాలను భావితరాలకు అందించగలుగుతామని చెప్పారు. పోరాట యోధులకు ఉత్తరాంధ్ర పెట్టింది పేరని ఇటీవల భోగాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అన్నారని గుర్తు చేశారు. మన్యం వీరునికి ఈ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేకంగా ఒక ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, అల్లూరి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

మరో చాన్స్..!

- ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు అవకాశం
- రెండో దశ సీట్ల భర్తీకి 15 వరకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు రెండో దశలో సీట్ల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను కేటాయించే ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తాజాగా ప్రకటించారు. ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 22వ తేదీన ప్రవేశాలకు లాటరీ నిర్వహిస్తామని, 24 నుంచి 28వ తేదీ వరకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. దీంతో పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు పొందడానికి మరో అవకాశం లభించింది.

మొదటి దశలో 625 మందికి అవకాశం

జిల్లావ్యాప్తంగా సుమారు 300 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గత నెలలో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 6 నుంచి 16వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ప్రవేశాల కోసం గతనెల 13, 25వ తేదీల్లో లాటరీ నిర్వహించారు. రెండు విడతల్లో కలిపి 625 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 478 మంది వివిధ పాఠశాలల్లో ఇప్పటి వరకు ప్రవేశాలు పొందారు.

దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆర్‌టీఈ చట్టం ప్రకారం 25 శాతం సీట్లు ఉచితంగా భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా రెండో దశలో సీట్ల భర్తీకి ఈ నెల 15వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. అర్హత కలిగిన పేద పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– బి లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

15 వరకు రెండో దశ దరఖాస్తుల స్వీకరణ

రెండో దశలో సీట్ల భర్తీకి తాజాగా ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. 15వ తేదీ వరకు స్వీకరిస్తారు. అర్హులైన వారు హెచ్‌టిటిపి://సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 22 వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. 22న లాటరీ పద్ధతిలో సీట్లను కేటాయిస్తారు. 24 నుంచి 28వ తేదీ వరకు ప్రవేశాలు పొందడానికి అవకాశం కల్పిస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ఆర్‌టీఈ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లను రిజర్వేషన్ ఆధారంగా కేటాయిస్తారు. అనాథ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ఎస్సీ పిల్లలకు 10 శాతం, ఎస్టీ పిల్లలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల ఆదాయం రూ 1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ 1.4 లక్షలు లోపు ఉండాలి.

పిచ్చికుక్క కరిచి పలువురికి గాయాలు


ఆస్పత్రి వద్ద గాయాలపాలైన బాధితులు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిపై దాడిచేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన గంటా వీరస్వామి, బత్తుల సతీష్, మెండాన చిన్నారావులతో పాటు మరో తొమ్మిదిమంది గాయాలపాలయ్యారు. వారంతా మండాకురిటి పీహెచ్‌సీకి వెళ్లగా వైద్యాధికారి వి.ప్రశాంత్ వ్యాక్సిన్ వేసి, ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం బాధితులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి


రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల జట్లు

- బేస్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక
- ఈ నెల 13 నుంచి 15వరకు అనంతపురంలో పోటీలు

తెర్లాం: రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల బేస్‌బాల్ పోటీల్లో (విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా) ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బాగా రాణించి పతకాలు సాధించాలని బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఉల్లిభద్ర జెడ్పీ హైస్కూల్ పీడీ బైరెడ్డి శ్రీనివాసరావు, తెర్లాం హైస్కూల్ పీడీ బంగారునాయుడులు కోరారు. ఈ నెల 13 నుంచి 15వరకు అనంతపురం జిల్లాలో రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లనున్న పురుషులు, బాలికల జట్లను ఎంపిక చేశారు. బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వహించిన ఎంపికకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు ఉన్నత పాఠశాలల క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా తరఫున ఒక్కో జట్టులో 16మంది చొప్పున 32మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఉల్లిభద్ర హైస్కూల్ పీడీ, తెర్లాం హైస్కూల్ పీడీలు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆటలోని మెలకువలు నేర్చుకోవాలని సూచించారు.